

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అశిష్ సంగ్వాన్, హాజరైన జిల్లా అధికారులు, దివ్యాంగులు

# ఓటు హక్కు బాధ్యతగా గుర్తించాలి

- నిర్మల్ కలెక్టర్ అశిష్ సంగ్వాన్
- ఓటు వినియోగం, సౌకర్యాలపై దివ్యాంగులకు అవగాహన సదుస్సు

నిర్మల్ టౌన్, నవంబర్ 9 : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని స్వీప్ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు ఓటు హక్కు వినియోగం, సౌకర్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లో ఈ నెల 30న ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. మొత్తం 906 పోలింగ్‌బూత్‌లుండగా, అన్ని పోలింగ్ చోట్లా దివ్యాంగులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతీ పోలింగ్ బూత్ వద్ద ట్రై సైకిళ్లతో పాటు ర్యాంప్‌ప్యాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దివ్యాంగులకు సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో అర్హులైన దివ్యాంగులు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వీప్ ఆధ్వర్యంలో జిల్లాలో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి విజయలక్ష్మి, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి రమేశ్, దివ్యాంగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్ వల్లే ఎమ్మెల్యే అయినవ్

- రెండుసార్లు గెలిపించిన్రు..
- తండ్రిలాంటి నాయకుడిపై దుర్భాషలాడడం సరికాదు
- రేఖానాయక్ అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డ ఎమ్మెల్సీ విఠల్, జడ్పీ చైర్మన్ జనార్దన్, సీనియర్ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్, చిత్రంలో జడ్పీ చైర్మన్, ఖానాపూర్ అభ్యర్థి, నాయకులు

ఉట్నూర్, నవంబర్ 9 : 'రేఖానాయక్.. నువ్వు సీం కేసీఆర్ వల్లే ఎమ్మెల్యే అయినవ్.., జడ్పీటీసీగా ఉన్న నిన్ను ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిపించిన్రు.. ఈ విషయాలను గుర్తుంచుకోవాలి.., అలాంటి నాయకుడుని పట్టుకొని దుర్భాషలాడడం సమంజసం కాదు..' అని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, సీనియర్ నాయకులు రవీందర్‌రావు ఆమె తీరుపై మండిపడ్డారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీలో సభలో సీఎం కేసీఆర్‌ను ఓరేయ్.. అంటూ సంబోధించడం మంచి పద్ధతి కాదని వార్నింగ్ ఇచ్చారు. తండ్రి లాంటి వ్యక్తిని తిట్టడం సరికాదని సూచించారు. 'ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు బంట్రోత్ అంటావా.., అవును.. మేము ప్రజలకు బంట్రోత్‌లుగా పనిచేస్తాం.., నీ లాగా వ్యక్తిగత స్వార్థానికో, కమీషన్ల కోసమో పనిచేయబోం.., ఇప్పటికైనా ప్రజా సంగ్రామంలో కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి..' అని డిమాండ్ చేశారు. ఇలాంటి నాయకుల గురించి ఖానాపూర్ ప్రజలకే వదిలేస్తున్నామన్నారు. మొదటి నుంచి ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌కు ప్రజల ఆదరణ ఉన్నదని, పథకాలే తమ అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను గెలిపిస్తాయని వెల్లడించారు. ఇక రేవంత్‌రెడ్డి చదువుకున్నోడిలా లేడని విమర్శించారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. రాజకీయంగా ఎదుర్కొలేకనే ఇలాంటి చౌకబారు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా, బోథ్ నియోజకవర్గాల్లో ఆదివాసీ అభ్యర్థులకు రేవంత్‌రెడ్డి అన్యాయం చేశారని విమర్శించారు. 'ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్ నాయక్ అమెరికా నుంచి వచ్చారని అంటున్నారు. మీ పార్టీలో 40 మంది అభ్యర్థులు అక్కడి నుంచి వచ్చారు. మరి వారికి టికెట్ ఎలా ఇచ్చారు..'అని ప్రశ్నించారు. ఇకపై కేసీఆర్ గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కేసీఆర్‌ను సేవాలాల్, తెలంగాణ గాంధీగా పొగిడినప్పుడు ఏమైందన్నారు. తమ పార్టీకి గిరిజనులు, గిరిజనేతరులు రెండు కండ్లలాంటి వారని పేర్కొన్నారు. ఎవరికీ నష్టం లేకుండా చూసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్, పెంబీ జడ్పీటీసీ జానుబాయి, భరత్ చౌహాన్, పెందూర్ ప్రభాకర్, పుర్క బాపురావ్, పుష్పారాణి, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, వైస్ ఎంపీపీ బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జగ్జీవన్‌రావు, మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్, తిరుపతి, దాసండ్ల ప్రభాకర్, ధరణీ రాజేశ్, సెడ్మకి సీతారాం, సింగారే భరత్, అమీనాబి, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- జనరల్ అబ్జర్వర్, సీనియర్ ఐఏఎస్ అధికారి కే గోపాలకృష్ణ
- నిర్మల్ జిల్లాలో పర్యటన

నిర్మల్ టౌన్, నవంబర్ 9 : అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్, సీనియర్ ఐఏఎస్ అధికారి కే గోపాలకృష్ణ అన్నారు. నిర్మల్ జిల్లాలో ఎన్నికల నిర్వహణను పరిశీలించేందుకు గురువారం ఆయన పర్యటించారు. స్థానిక అటవీశాఖ గెస్టుహౌస్‌లో కలెక్టర్ అశిష్ సంగ్వాన్, ఎప్పీ ప్రవీణ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. కలెక్టర్, ఎస్పీతో జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, నామినేషన్ ప్రక్రియ, ఓటరుస్లిప్పుల పంపిణీ, భద్రత, తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



ప్రత్యేక పరిశీలకుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్

### జిల్లాకు చేరుకున్న ప్రత్యేక పరిశీలకులు

ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలించేందుకు ఎన్నికల కమిషన్ నియమించిన ప్రత్యేక పరిశీలకులు గురువారం నిర్మల్ చేరుకున్నారు. రవిరంజన్ విక్రమ్(సీనియర్ ఐఏఎస్ అధికారి), కే గోపాలకృష్ణ (సీనియర్ ఐఏఎస్ అధికారి), లక్ష్మణ్ నింబార్గి (సీనియర్ ఐఏఎస్ అధికారి) జిల్లాకు రాగా, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ తదితరులు పుష్పగుచ్ఛం అందించారు. నిర్మల్ జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ప్రత్యేక పరిశీలకులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ గుర్తింపు కార్డులు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ఆరా తీశారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి దేవేంద్రబాబు

# జాతీయ న్యాయ సేవా దినోత్సవం

భైంసా, నవంబర్ 9 : భైంసా పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసా న్యాయమూర్తి దేవేంద్ర బాబు మాట్లాడారు. యేటా నవంబర్ 9న జాతీయ న్యాయ సేవా దినోత్సవం జరుపుకుంటున్నట్లు చెప్పారు. పౌరులకు సమాచారం అందించడంతో పాటు సమాజంలోని బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలను ప్రోత్సహించడానికి పనిచేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, వికలాంగులు షెడ్యూల్డ్ తెగలు, కులాలు, పిల్లలు, మానవ అక్రమ రవాణా బాధితులు, అలాగే ప్రకృతి వైపరీత్యాల బాధితులైన బలహీన వర్గాలకు దేశ వ్యాప్తంగా ఎలాంటి రుసుము లేకుండా న్యాయ సేవలను అందించడం న్యాయ సేవా లక్ష్యమన్నారు. ఈయన వెంట న్యాయవాదులు రవీందర్ సింగ్, వెంకటేశ్ పార్టికర్, తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే రామన్నను విమర్శించే హక్కులేదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాజిదొద్దీన్

ఎదులాపురం, నవంబర్ 9 : అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగుతున్న ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్నను విమర్శించే హక్కు కాంగ్రెస్ పార్టీ నేతలకు లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాజిదొద్దీన్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధి గురించి మాట్లాడని కాంగ్రెస్ నేతలు, కేవలం జోగు రామన్నపై నిందలు వేస్తూ రాజకీయ పబ్బంగడుపుకుంటున్నారని మండిపడ్డారు. టికెట్లను అమ్ముకున్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ లీడర్లకు మొండిచేయి చూపారని విమర్శించారు. అలాంటి నేతలను నమ్మే పరిస్థితిలో ప్రజానీకం లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ విజ్జగిరి అశోక్, నాయకులు దివిటి రాజు, జంగిలి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# కలిసికట్టుగా బీఆర్ఎస్‌ను గెలిపిద్దాం

ఖానాపూర్ రూరల్, నవంబర్ 9 : రానున్న 20 రోజుల్లో ప్రతికార్యకర్తా కలిసికట్టుగా పనిచేసి, బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పార్టీ సీనియర్ నాయకులు సముద్రాల వేణుగోపాలాచారి, పూర్ణ చంద్రనాయక్ పేర్కొన్నారు. ఖానాపూర్ మండలం తర్లపాడు గ్రామంలో గురువారం బీఆర్ఎస్ నాయుకులతో అత్యున్నత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌ను భారీ మేజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అందుకు ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తా కష్టపడి తమదైన శైలిలో సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు వేణుగోపాలాచారి, పూర్ణ చంద్రనాయక్



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

# క్రీడాకారులకు అభినందనలు

నిర్మల్ అర్బన్, నవంబర్ 9 : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపి, జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు సందేశ్, మనీష్ (బాసర, నాగభూషన్ విద్యాలయం), డీ సుమిత్ (నిర్మల్ మహాత్మా జ్యోతిబాపూలే)ను గురువారం డీఈవో కార్యాలయంలో విద్యాధికారి రవీందర్‌రెడి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి, నిర్మల్ జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరి రమణా రావు, ప్రిన్సిపల్ బాబురావు, నందకుమార్, పీఈటీలు ఇమ్రాన్, పెంటన్న, మల్లేశ్ పాల్గొన్నారు.